సాక్షి పల్నాడు

బుధవారం । 10 । జూలై । 2024



అన్నదానం

గురజాల: స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ఆవరణలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఆకస్మిక తనిఖీలు

రెంటచింతల: మండలంలోని విత్తనాలు, పురుగుమందుల షాపులను వ్యవసాయ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అఖండజ్యోతి ప్రజ్వలన

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం వితంరాజుపల్లి శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ తొలి ఏకాదశిని పురస్కరించుకొని కొండపై తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు హిమాలయ గురూజీ తెలిపారు.



న్యూస్‌రీల్

భవిత పాఠశాలను సందర్శించిన సెల్వరాజు



క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల భవిత సెంటర్‌ను కో ఆర్డినేటర్ సెల్వరాజు మంగళవారం సందర్శించారు. భవిత విద్యార్థుల ప్రగతి పరిశీలించారు. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపి కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేసి, విద్యార్థుల పురోభివృద్ధికి కొన్ని ముఖ్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గణేష్, ఐఈడీ ఉపాధ్యాయులు శ్వేత, వెంకటరత్నం, ఫిజియోథెరపిస్ట్ కుమారి పాల్గొన్నారు.

మహిళలు, పురుషులు పనిచేసే చోట ఇంటర్నల్ కమిటీ

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ లీగల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్



నరసరావుపేట: పది మంది అంతకంటే ఎక్కువ పురుషులు, మహిళలు కలిసి పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటుచేసి మహిళల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ లీగల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిహారం)2013 చట్టం, దాని అమలు చేసే విధానంపై సీడీపీవో ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్వో కె.వినాయకం, సీడీపీవో కె.ఉమారాణి, మహిళా న్యాయవాది అమూల్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మూడు రోజులు సెలవు

- ఈ ప్రాంతంలో డయేరియా ప్రబలటమే కారణం
- డిప్యూటీ డీఈవో వి.ఏసుబాబు

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీ నగర్ ప్రాంతాల్లో డయేరియా అదుపులోకి రాకపోవటంతో లెనిన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. మంగళవారం లెనిన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈవో డి.ఏసుబాబు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మారుతీనగర్ పట్టణ వైద్యశాల పరిధిలో డయేరియా కేసులు ఎక్కువ కావటంతోపాటు మరణాలు సంభవిస్తుండటంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో బుధవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు ఈ పాఠశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ మూడు రోజులు తమ గృహాలలో ఉండాలని సూచించారు. ఈయన వెంటన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

12న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 12న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్ఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.in తోపాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని సూచించారు. అలాగే వెబ్ ఎక్స్ ఐడీ 2644 170 9396, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 503.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.80 అడుగుల వద్ద ఉంది.

కడుపు కోతలే

- పల్నాడు జిల్లాలో 55 శాతానికిపైగా సిజేరియన్లు
- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- కాసుల కోసం ప్రైవేట్ యాజమాన్యాల కక్కుర్తి
- భయం, మంచి ముహూర్తాల కోసం ఒత్తిడి చేస్తున్న గర్భిణులు, కుటుంబ సభ్యులు



సాక్షి,నరసరావుపేట: నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి గత నెల ఒక గర్భిణి వచ్చింది. ఆమె సహజ కాన్పుకు అవసరమైన ఆరోగ్య, మానసిక పరిస్థితులు ఉన్నాయి. మూడు నెలలుగా చేస్తున్న పలు పరీక్షల రిపోర్టులు బాగా ఉన్నాయి. సాధారణ కాన్పు చేయాలని కుటుంబ సభ్యులు సూచించారు. అయినా సరే ఆసుపత్రి సిబ్బంది భయపెట్టి సిజేరియన్ వైపు మళ్లించారు. సుమారు రూ.1.2లక్షల దాకా బిల్లు చేశారు. నెల తిరగక ముందే ఆ మహిళకు తీవ్ర కడుపు నొప్పి వస్తోంది. వైద్యులను సంప్రదిస్తే సిజేరియన్ సైడ్ ఎఫెక్ట్ వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎందరో మహిళకు శాపంలా తయారైంది. పంటిబిగువున నొప్పిని భరించి, ప్రసవ వేదనను అనుభవించి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. అవసరం ఉన్నా, లేకున్నా కాన్పు కోతలు పెరిగిపోతున్నాయి. ఇది తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ముప్పు తెచ్చి పెట్టే విషయం. కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే సిజేరియన్లు చేయాలి. ఇది మొత్తం కాన్పుల్లో 25 శాతానికి మించడం ప్రమాదం. అయితే పల్నాడు జిల్లాలో ఇది 55 శాతం పైగా ఉంటోంది.

కాన్పుకు వెళితే కోతే...

సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు, కడుపులో బిడ్డ సరిగా లేనప్పుడే సిజేరియన్లు చేయాలి. సహజ ప్రసవానికి అవకాశం ఉన్నప్పటికీ.. ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డం తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకుంటోందని, పురిటి నొప్పుల బాధ భరించలేరని పేర్కొంటూ బాధిత బంధువులను భయపెట్టి అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవంతో పోలిస్తే.. సిజేరియన్ ప్రసవాలకు పట్టే సమయం కూడా చాలా తక్కువ. సర్జరీ చేయడం వల్ల ఆస్పత్రికి ఆదాయం సమకూరుతుంది. ఈ రెండు అంశాలు కలిసి వచ్చే అంశాలు. సిజేరియన్ ప్రసవాలు ఆ తర్వాత తరచూ కడుపు నొప్పి, ఇన్‌ఫెక్షన్, అధిక బరువు, నెలసరి వంటి సమస్యలకు కారణమవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

సాధారణ ప్రసవాలతో ప్రయోజనాలు

సాధారణ ప్రసవాల వల్ల తల్లీ పిల్లలకు బహుళ ప్రయోజనాలు అందడానికి వీలుంటుంది. సాధారణ ప్రసవాల్లో మహిళలు రెండు రోజుల్లోనే ఎప్పటిలా పనులు చేసుకోవడానికి వీలుంటుంది. రెండో కాన్పుపై దుష్ప్రభావం ఉండదు. గర్భసంచికి ప్రమాదం ఉండదు. భవిష్యత్తులో రుగ్మతలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లిపాలు అందించవచ్చును.

మంచి ముహూర్తం కావాలంటూ...

కొందరు గర్భిణులు, కుటుంబ సభ్యులు కూడా సిజేరియన్‌కు మొగ్గుచూపుతున్నారు. నొప్పి భయం, మంచి ముహూర్తం అంటూ వైద్యులను ఒత్తిడి తెచ్చేవారు ఉంటున్నారు.

అనవసరంగా సిజేరియన్లు చేస్తే చర్యలు



జిల్లాలో సాధారణ ప్రసవాలు ఎక్కువ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా గర్భిణులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సిజేరియన్ వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించి అవగాహన పెంచుతున్నాం. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. అటువంటివాటికి మెమోలు అందజేస్తున్నాం. ప్రత్యేకంగా ఆడిట్ చేస్తున్నాం. అనవసరంగా చేస్తున్నారని తెలిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆసుపత్రిని మూసేస్తాం. గర్భిణులు, కుటుంబ సభ్యులు సిజేరియన్ల వైపు మొగ్గు చూపకుండా ఉండాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ బి రవి, డీఎంహెచ్ఓ, పల్నాడు జిల్లా.

సిజేరియన్ వల్ల తల్లీబిడ్డకు నష్టం

ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఎక్కువగా జరుగుతున్న సిజేరియన్ల వల్ల తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదాలు ఉన్నాయని నిపుణులైన వైద్యులు చెబుతున్నారు. ఆపరేషన్లు చేయించుకోవడం వల్ల లాభాల కన్నా నష్టాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు తాగితే అవి అమృతంతో సమానం అంటున్నారు. శస్త్ర చికిత్సల కారణంగా మొదటి గంటలో తల్లిపాలు తాగే వీలు లేకుండా పోవడంతో నష్టం జరుగుతోంది. రక్తస్రావం అధికమైనా, ఇతరత్రా సమస్యలు తలెత్తినా ప్రాణాపాయంతోపాటు భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కొనాల్సి రావచ్చు. గర్భాశయానికి గాట్లు పెట్టి కుట్లు వేసిన ప్రాంతంలో మాయ అతుక్కుపోయే అవకాశాలుంటాయి. దీంతో అప్పుడప్పుడు తీవ్ర కడుపు నొప్పి సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భసంచి తొలగించే పరిస్థితి ఏర్పడవచ్చు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలసిన నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.

-సాక్షి, ఫొటోగ్రాఫర్, తాడేపల్లి

సంక్షేమం అమలులో సహకారం అందజేస్తాం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు



కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట: సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగులందరూ తగిన సహకారం అందజేస్తారని ఎన్‌జీఓ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు తెలిపారు. గత ఆదివారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అసోసియేషన్ తాలూకా యూనిట్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఆనంద్‌నాథ్, ఉపాధ్యక్షులు డీవీడీ ప్రసాద్, రవికుమార్, నారాయణ, పీవీఎస్ నాగేశ్వరరావు, రామానుజన్‌రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాసరావు, మాణిక్యమ్మ, మహిళా అధ్యక్షురాలు అనురాధ, పద్మావతి పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఎస్పీ శుభాకాంక్షలు

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత ఆదివారం నూతన కలెక్టర్‌గా అరుణ్‌బాబు బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర





పట్టణ శివాజీచౌక్‌లో శ్రీజగన్నాథస్వామి రథయాత్ర (ఇన్‌సెట్‌లో) రథంపై శ్రీజగన్నాథస్వామి

తెనాలి: పట్టణ నాజరుపేటలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథస్వామి రథయాత్ర కనులపండువగా నిర్వహించారు. పూరీలో జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నట్టే ఇక్కడా ఏటా జరుపుతున్న విషయం తెలిసిందే. స్థానిక శివాజీచౌక్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఆరంభమైన యాత్రలో భక్తులు భారీగా పాల్గొన్నారు. విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు సంప్రదాయ దుస్తులతో భజనలు చేస్తూ యాత్రలో ముందుకు సాగారు. చిన్న పిల్లలు దేవతా వేషధారణలతో కనిపించారు. కూచిపూడి శాస్త్రీయ నృత్యప్రదర్శనలు, జానపద డప్పువాయిద్యాలు, కోలాటం, భజనల కోలాహలం మధ్య యత్యార రమణీయంగా సాగింది. స్వామి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి సింహ గౌరదాస్ మాట్లాడుతూ పూరి జగన్నాథస్వామిని రథయాత్రను దర్శించుకోలేని భక్తుల కోసం ఈ యాత్రను ఏటా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు ముకుంద మాధవ దాస్, చక్రధారిదాస్, పట్టణ ప్రముఖులు కొత్త సుబ్రహ్మణ్యం, ముమ్మలనేని జానకి రామచంద్రరావు, కిక్కూరి శ్రీనివాస్‌రెడ్డి, సాగిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో స్వామి సేవా కార్యక్రమాలు, ప్రసాద వితరణ నిర్వహించారు.

అవినీతికి తావులేకుండా ఉచితంగా ఇసుక అందజేయాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



కొండమోడులో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

రాజుపాలెం: అవినీతికి తావులేకుండా పకడ్బందీగా లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందజేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండమోడులో ఇసుక డంపింగ్ యార్డును కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే అందించాలని తెలిపారు. అన్నీ ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని డిపోలో నగదు లావాదేవీలు జరగరాదని చెప్పారు. అనంతరం మైనింగ్ జిల్లా ఏడీ నాగిని మాట్లాడుతూ జిల్లాలో అమరావతి మండలంలో వైకుంఠపురం, అచ్చంపేట మండలంలో కోనూరు, మాదిపాడు, కొత్తపల్లి ఇసుక స్టాక్ పాయింట్‌లు ఉన్నాయని తెలిపారు. రాజుపాలెం మండలంలో కొండమోడు, వినుకొండలో ఇసుక డంపింగ్ యార్డులు ఉన్నట్లు చెప్పారు. కొండమోడులో ఒక వ్యక్తి(ఒక ఆధార్‌కార్డుకు) ఒక్క రోజు 20 టన్నులు ఇసుక మాత్రమే ఇస్తున్నట్లు చెప్పారు. టన్ను రూ.565గా నిర్ణయించారని, పేమెంట్‌లు ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయని చెప్పారు. ఇక్కడి నుంచి తీసుకెళ్లి వేరే చోట స్టాక్ పెట్టినా, బ్లాక్ మార్కెట్‌లో అమ్మినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దారు లక్ష్మీనరసింహా, వీఆర్వోలు, సర్వేయర్‌లు ఉన్నారు.

'ఐరన్ మ్యాన్' అనిల్ కుమార్

- ట్రైథ్లాన్‌లో సత్తా
- అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- ఉన్నత ఉద్యోగంతోపాటు క్రీడా సాధన



స్విమ్మింగ్‌లో అనిల్ కుమార్



సైక్లింగ్‌లో పోటీపడుతున్న అనిల్ కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం, చక్కని కుటుంబం ఉన్నా ఇంకా ఏదో సాధించాలనే తపన ఆ ఉన్నతాధికారిని విజయతీరాలకు చేర్చింది. అకుంఠిత దీక్ష.. కఠోర శ్రమ.. అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చాయి. ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్‌లో విజేతగా నిలిపాయి. గుంటూరుకు చెందిన జె.అనిల్ కుమార్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో సీనియర్ మేనేజర్. ఆయన విధులు నిర్వహిస్తూనే గత నెలలో జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ పోటీల్లో పాల్గొన్నారు. నిర్ణీత సమయాని కంటే ముందుగానే కఠోర లక్ష్యాలను అధిగమించి శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్ర కీర్తిపతాకను విశ్వ యవనికపై రెపరెపలాడించారు.

మలుపు తిప్పిన గుంటూరు బదిలీ

అనిల్ కుమార్ స్వస్థలం చిత్తూరు. ఉద్యోగ రీత్యా అనేక రాష్ట్రాలు తిరుగుతూ కరోనా సమయంలో గుంటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడి సైక్లిస్ట్, స్విమ్మర్స్ పరిచయంతో ఆయనలోని అథ్లెట్ మళ్ళీ మేల్కొన్నాడు. దీంతో ఆయన సాధన ప్రారంభించారు. అన్ని విభాగాల్లోనూ రాటుదేలారు. కఠోర సాధన చేయాల్సి రావడంతో మొదట్లో ఆయన భార్య కొంత ఆందోళన చెందినా ఆయన ఉత్సాహం చూసి సహకరించారు.

ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ అంటే ఏమిటి!

ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్‌లో ప్రధానంగా మూడు విభాగాలు స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్ ఉంటాయి. నిర్వాహకులు నిర్ణయించిన సమయంలో వాటిని ఎటువంటి విశ్రాంతి తీసుకోకుండా పూర్తి చేయాలి. జర్మనీలోని హాంబర్గ్‌లో గత నెలలో నిర్వహించిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ పోటీల్లో 70 దేశాల నుంచి సుమారు 2,500 మంది అథ్లెట్స్ పాల్గొన్నారు. స్విమ్మింగ్ 3.8 కిలోమీటర్లను 2.20 గంటల్లో, సైక్లింగ్ 180 కి.మీ.ని 7.10 గంటల్లో రన్నింగ్ 42.2 కి.మీ.ని 6 గంటల్లో మొత్తం ఈ మూడు విభాగాలను 15 గంటల 30 నిమిషాల్లో పూర్తి చేయాలని నిర్వాహకులు నిబంధనలు విధించారు. అనిల్ కుమార్ 13 గంటల 9 నిమిషాల్లోనే ఈ మూడింటినీ పూర్తిచేసి ఐరన్ మ్యాన్‌గా నిలిచారు. ఆయనతోపాటు కోచ్ రుషిల్, సీనియర్ అథ్లెట్ రవీంద్ర కూడా పాల్గొన్నారు. ఇది ఎంతో రిస్క్‌తో కూడుకున్న క్రీడ మాత్రమే కాదు ఆర్థికంగా కొంత ఖర్చుతో కూడుకున్నదని వారు చెప్పారు.

ఈ సాధన కొనసాగుతుంది



కరోనా సమయంలో గ్రూప్ స్పోర్ట్స్‌కు బదులుగా వ్యక్తిగత క్రీడలైన స్విమ్మింగ్, సైక్లింగ్, యోగాలాంటి వాటిపై ఆసక్తి బాగా పెరిగింది. రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తుంటాను. ఒక్క నిమిషం కూడా వృథా చేయడానికి ఇష్టపడను. ఐరన్‌మ్యాన్‌గా గుర్తింపు సాధించిన తర్వాత నా ఆత్మ స్థైర్యం మరింత పెరిగింది. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొంటాను. నాకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

– జె.అనిల్ కుమార్, అథ్లెట్

క్లుప్తంగా

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట: తన గృహంలో తమ్ముళ్ల తన్నులాటలో గాయపడిన టీడీపీ కార్యకర్త అల్లూరి హరికృష్ణను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హరికృష్ణను సోమవారం సాయంత్రం వెళ్లి అతనితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. తీవ్ర గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తనను కనీసం పరామర్శించేందుకు కూడా ఎమ్మెల్యే రాలేదని బాధితుడు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఎమ్మెల్యే వెంట వాసిరెడ్డి రవి ఉన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



గుంటూరు రూరల్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని నల్లపాడు పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ హీనీమెహత తెలిపారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న క్లష్టర్ స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ హైదరాబాద్ రీజియన్ ఆదేశాల మేరకు ఈనెల 8, 9 తేదీలలో అండర్–17 బాలికల ప్రాంతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. వివిధ క్లస్టర్ల నుంచి 84 మంది క్రీడాకారులు, ఏడు జట్లు పోటీలో పాల్గొన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మ్యాచ్‌లను నిర్వహించినట్లు వెల్లడించారు. కబడ్డీలో బాలికల నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రెండు రోజులపాటు జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ 17 విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలో అనంతపురానికి చెందిన కబడ్డీ జట్టు విజేతగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ నామినీ చైర్మన్ బి రవికుమార్, ఉపాధ్యాయులు టి లక్ష్మీప్రసన్న, ఎస్ ఆనంద్, సునీల, పీఈటీలు అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలు తెనాలి,వాల్తేరు



అండర్-17లో ప్రథమ స్థానం సాధించి బహుమతి అందుకుంటున్న కేంద్రీయ విద్యాలయ వాల్తేరు జట్టు క్రీడాకారులు



అండర్-14లో ద్వితీయ స్థానం సాధించి బహుమతి అందుకుంటున్న కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి జట్టు క్రీడాకారులు

- ద్వితీయ స్థానం దక్కించుకున్న హైదరాబాద్, సత్తెనపల్లి
- విజేతలకు బహుమతులు ప్రదానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో కేంద్రీయ విద్యాలయ హైదరాబాద్ రీజియన్ లెవల్ అండర్–14, అండర్–17 బాలుర వాలీబాల్ పోటీల్లో వాల్తేరు, తెనాలి ప్రథమ స్థానం సాధించి విజేతలుగా నిలిచాయి. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన హైదరాబాద్ రీజియన్ లెవల్ అండర్–14, అండర్–17 బాలుర వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని నాలుగు క్లస్టర్ల నుంచి 16 టీమ్‌లు హాజరయ్యాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రథమ స్థానం కేంద్రీయ విద్యాలయ తెనాలి, ద్వితీయ స్థానం కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి, తృతీయ స్థానం కేంద్రీయ విద్యాలయ హకీంపేట కైవసం చేసుకున్నాయి. అండర్–17 విభాగంలో ప్రథమ స్థానం కేంద్రీయ విద్యాలయ వాల్తేరు, ద్వితీయ స్థానం కేంద్రీయ విద్యాలయ సీఆర్పీఫ్ హైదరాబాద్, తృతీయ స్థానం కేంద్రీయ విద్యాలయ క్లస్టర్–2 సికింద్రాబాద్ జట్టు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్ల నుంచి టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.కిరణ్‌రెడ్డి పర్యవేక్షణలో రీజియన్ జట్టుని ఎంపిక చేశారు. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు పసుపులేటి సురేష్ మాట్లాడుతూ క్రీడల సమయాన్ని క్రీడలకే వినియోగించుకోవాలన్నారు. ప్రతి క్రీడాకారుడు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. క్రీడల్లో రాణించడం వల్లన మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ముందుగా గెలుపొందిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు బహుమతులు, మెడల్స్ అందించారు ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు



పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

దుర్గి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలను సరైన ధరతోపాటు నకిలీ విత్తనాల బెడద లేకుండా రైతులకు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా దుర్గి, ముటుకూరు, అడిగొప్పల గ్రామాలలో ప్రత్యేక బృందం పలు దుకాణాలలో తనిఖీలు చేపట్టింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు డీడీఏ సీహెచ్ శ్రీనివాసరావు, గుంటూరు విజిలెన్స్ ఎస్‌ఐ రామచంద్రయ్య, డీఎఓ ఆఫీసు ఏఓ వరలక్ష్మి, స్థానిక ఏఓ వై అమీర్‌రెడ్డిలు బృందంగా ఏర్పడి విత్తనాలు, పురుగుమందుల షాపులలో తనిఖీలు నిర్వహించారు. దుర్గిలో మూడు షాపులలో, ముటుకూరులో రెండు షాపులలో విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల షాపులలో తనిఖీలు నిర్వహించగా సరైన పత్రాలు చూపనందున రూ.25,982 విలువైన మైక్రో న్యూట్రీషన్, రూ.6,02,400 విలువైన కంది విత్తనాలు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. వ్యాపారులు అనుమతి ఉన్నటువంటి విత్తనాలు, పురుగుమందులను విక్రయించి సంబంధిత రశీదులను రైతులకు తప్పనిసరిగా అందించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువులు పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

కారెంపూడి: వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ పీబీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు కారెంపూడిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. కారెంపూడిలో అన్ని షాపులను తనిఖీలు చేశామని సరైన బిల్లులు లేకుండా ఉన్న విత్తనాలు, పురుగు మందులను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. రూ.7,65,600 విలువైన పత్తి, మిరప విత్తనాలను, రూ.25,834 విలువైన పురుగు మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీలలో విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్, పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయశాఖ అధికారి బి యలమందారెడ్డి పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఏఐసీటీఈ ఉపకార వేతనాలు



గుంటూరుఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అందించే ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏఐసీటీఈ ప్రగతి ఉపకార వేతనాలు అందించి, ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా తమ కళాశాలలో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్న వారిలో 30 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా, వారిలో ఆరుగురు ఎంపికైనట్లు వివరించారు. కుంచాల వైష్ణవి, వాసిమళ్ల బ్యూలా, కానోజియా దేవంతి, సిరిపురపు హర్షిత, క్రోసూరి రుషిత, సోమరౌతు లిఖిత వేదసాయి మాన్వితకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బి. రామసుందరి పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి ఆత్మహత్య



దాచేపల్లి: క్వారీ గుంతలో పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ జీ.సంధ్యారాణి తెలిపిన వివరాలు ఇలా.. మాచవరం మండలం వేమవరానికి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతయ్య(21) మద్యానికి బానిసగా మారాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్న క్రమంలో అతిగా మద్యం తాగి విధులకు హాజరుకావడంతో యజమానులు విధుల నుంచి తొలగించారు. నాలుగు రోజుల కిందట వేమవరం వచ్చి తండ్రి వద్దనే ఉంటున్నాడు. మద్యానికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావని తండ్రి మందలించి, మద్యం తాగకుండా అడ్డుకున్నాడు. దీంతో ఇంటి నుంచి బయలుదేరిన తిరుపతయ్య నడికుడి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్ సమీపంలోని క్వారీ గుంతలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు స్థానికుల సహాయంతో నీళ్లలో తేలాడుతున్న మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు అవివాహితుడు.

గణపవరంలో చోరీ

రూ.40 వేలు అపహరణ



దుండగులు నగదు కాజేసిన బ్యాగు

నాదెండ్ల: గణపవరం రామ్‌నగర్‌లో ఓ ఇంట్లో చోరీ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతినగర్ రామాలయం వెనుక బజారులో నివాసం ఉండే కొత్తకోట లక్ష్మి, భర్త ప్రసాద్ చిలకలూరిపేట పట్టణంలో కూలి పనులకు వెళ్తుంటారు. వీరి కుమారుడు గుంటూరులో ఉద్యోగం చేస్తుంటాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి తాళాలు పగలగొట్టి బీరువా తెరిచారు. పక్కనే బ్యాగులో ఉన్న రూ.40 వేల నగదు అపహరించారు. దీనిపై బాధితురాలు లక్ష్మి నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గణపవరంలో వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

– ఇండియన్ నావెల్ అకాడమీ సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్



ఇండియన్ నావెల్ అకాడమీ సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: భారత రక్షణ దళాలలోని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకుంటూ, దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ) సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌పై సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ భారత రక్షణ దళాల్లో బిటెక్ విద్యార్థులకు గల ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యాభ్యాస సమయంలోనే విద్యార్థులు ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. భారత సైనిక త్రివిధ దళాలలోని సైనికులకు ఉద్యోగ భద్రతతోపాటుగా, కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన విద్యా, వైద్య సేవలతో వివిధ రకాల సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నుంచి లభిస్తాయని వివరించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ ఇండియన్ నావెల్ అకాడమీ(కేరళ)సబ్ లెఫ్టినెంట్‌గా ఉన్నత పదవిలో దేశరక్షణ వ్యవస్థలో సేవలందిస్తున్న సాయిరామ్ తమ కళాశాల పూర్వవిద్యార్థి కావడం సంతోషకరమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ వి.తారాచంద్ తదితరులు ముఖ్యఅతిథిని సన్మానించారు.

ఔత్సాహిక యువతకు అగ్రి స్టార్టప్‌ల ద్వారా శిక్షణ

వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి



గుంటూరురూరల్: వ్యవసాయ రంగంలో ఔత్సాహిక యువతకు అగ్రి స్టార్టప్‌ల ద్వారా విస్తృత స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పించే దిశగా శిక్షణ ఇచ్చేందుకు కృషిచేస్తున్నామని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో వీసీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అన్ని రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ప్రస్తుతం తిరుపతిలో ఒకే ఒక్క కేంద్రం పనిచేస్తోందని, వీటిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు శాస్త్రవేత్తలు కృషిచేయాలని సూచించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో పరిశోధన ఫలితాలను, వ్యవసాయ ఆవిష్కరణలను అగ్రి స్టార్టప్‌ల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి మాట్లాడుతూ అగ్రిస్టార్టప్‌లను విస్తరించాలని పేర్కొన్నారు. డీన్ డాక్టర్ జి కరుణాసాగర్ మాట్లాడుతూ 2020 నుంచి అమలులోకి వచ్చిన నూతన విద్యావిధానంలో వ్యవసాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులనూ స్టార్టప్‌లలో లింక్‌చేసి వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే బిల్డింగ్ అగ్రి ఇన్నోవేషన్స్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ ఇంక్యుబేషన్ ఇన్ అంగ్రూ అనే కార్యక్రమం బుధవారంతో ముగియనుంది. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, విశ్వవిద్యాలయం పోషణ్ ఇంక్యూబేటర్ అధిపతి డాక్టర్ కదిరి మోహన్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యా వ్యవస్థపై దృష్టి సారించండి

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు



కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో విద్యావ్యవస్థపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.అరుణ్‌బాబును మంగళవారం కలెక్టరేట్‌లో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో విద్యారంగ పరిస్థితులు, పాఠశాలల స్థితిగతులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత గురించి కలెక్టర్‌తో చర్చించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమకుమార్, జి.విజయసారథి విద్యారంగంలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతుందని, మండలాల్లో ఎంఈఓల నియామకాలపై దృష్టి సారించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు

చిలకలూరిపేట: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పని చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 25వేల మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు జమచేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిదో తేదీ దాటినా ఇప్పటికి జీతాలు చెల్లించలేనందున విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఈ జీతాలపైనే వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాల్సి ఉందన్నారు. సమావేశంలో సంఘ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, జిల్లా కౌన్సిలర్ షేక్ జమీర్‌బాషా, నాయకులు చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న వజ్రగిరి జెస్టిస్

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గౌరవ డాక్టరేట్ పొందారు. జెస్టిస్ తన 40 సంవత్సరాల చిత్రకళ ఆధ్యాత్మిక, సేవా రంగాలలో సాధించిన 52 అవార్డులు, రివార్డులు ఎన్నో చిత్రాలు, రికార్డులు సర్టిఫికెట్స్‌ను థీసిస్‌గా సమర్పించి లోగోస్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారి ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీకి చెందిన బిషప్ మోసెస్ వినుకొండకు విచ్చేసి జెస్టిస్ అవార్డులు, చిత్రాలు తదితర విశేషాలు పరిశీలించి ఎఫ్రాయిమ్ చర్చిలో ఏర్పాటు చేసిన సభలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ విషయమై పలువురు పట్టణ రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు జెస్టిస్‌ను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రిటైర్డ్ ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శామ్యూల్ ఆనంద్, రాజకుమారి

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు ఉన్నాయని రిటైర్డు ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్ చెప్పారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో రైతు ఎస్.ఉమామహేశ్వరరావు పొలంలో 30 రకాల పంటల వైవిధ్యంతో కూడిన పీఎండీఎస్ క్షేత్రాన్ని అధికారుల బృందం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన పంటల కంటే ముందుగా 30 రకాల జీవ వైవిధ్య పంటలతో కూడిన పచ్చిరొట్ట పంటలు వేసిన రైతు పొలంలో నత్రజని స్థిరీకరించే రైజోబియం, వేరు బుడిపెలు విస్తారంగా అభివృద్ధి చెందడాన్ని గుర్తించింది. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తదితరులు మాట్లాడుతూ ప్రధాన పంటల సాగులో వేరు వ్యవస్థ ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షకులు వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

డయేరియాతో కార్మికుడు మృతి



మృతుడు ఆంజనేయులు

పిడుగురాళ్ల: డయేరియా వ్యాధితో సున్నపు బట్టి కార్మికుడు మృతి చెందాడు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తిరుమలకొండ ఆంజనేయులు(60) గత శనివారం వాంతులు విరేచనాలు కావటంతో మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేరారు. అక్కడ వైద్య సేవలు పొందాడు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటతో వైద్యులు సోమవారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఆంజనేయులు మృతికి కార్మిక, ప్రజాసంఘాల నివాళి..

డయేరియాతో మృతి చెందిన తిరుమలకొండ ఆంజనేయులు భౌతికకాయాన్ని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సీపీఐఎం జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు వీర్లంకయ్య, కోటేశ్వరరావు, నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్య



మృతురాలు విజయశాంతి

నాదెండ్ల: కడుపు నొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడికందుల విజయశాంతి (35) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యులకు చూపినా ఫలితం లేకపోవటంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త సాంబశివరావు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

మంగళగిరి: యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరామ్ కాలనీలో ఉంటున్న సురేష్ తన కుటుంబంతో కలిసి ఈనెల 6న ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడం చూసిన సురేష్ కుటుంబ సభ్యులు చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.15 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు మాయమైనట్టు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినుకొండలో వ్యాపారి ఆత్మహత్య



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో అపరాల వ్యాపారి ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని దక్షిణం బజారుకు చెందిన గుడివాడ లక్ష్మీనారాయణ (62) మధ్యాహ్నం సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేటప్పటికే లక్ష్మీనారాయణ మృతి చెందాడు. ఆయన మృతికి ఆర్థిక ఇబ్బందులు కారణమా?, మరేమైనా ఇతర సమస్యలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయిలో పోలీసులు దర్యాప్తు చేస్తేనే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. నాయకుడు వాసిరెడ్డి రవి ఉన్నారు.